# ఆడంబరము(Pretense)

పూజ్యబాబూజీ మహారాజ్ గారు అహంకారము గూర్చి చక్కని వివరణ ఇచ్చారు. మనలో లేనిది ఉన్నట్లుగా చెబితే అది అహంకారమని వారు చెప్పారు. దీనికి ఉదాహరణగా ఒక వ్యక్తి తాను M.A లో ఉత్తీర్ణతను సాధించి నేను M.A చదివినానని చెబితే అది అహంకారము కాదు. కాని దానిలో ఉత్తీర్ణతను సాధించకుండా అతను ఆమాట అంటే అది అహంకారము. ఆధ్యాత్మిక పురోగతిలో అహంకారమును నిర్మూలించవలసిన ఆవశ్యకత గూర్చి ప్రత్యేకించి చెప్పనవసరము లేదు. సత్యము లేకుండా ఆధ్యాత్మికత లేదు. ఈ సందర్భములో సాధకులు పూజ్య గురుదేవులు ఇచ్చిన దశాదేశములలో ఐదవ ఆదేశమును గుర్తు చేసుకొనవలెను.

ఇతరులతో అసత్యమాడినా లేదా మన అంతరంగముతో ఆడినా ఒకటే. కాస్త మర్యాదకు అసత్యమనే పదమునకు బదులుగా నటన లేదా ఆడంబరము అనే పదములను ఉపయోగించెదము. తాము ఆచరించు విధానములో నటించుటకు, తమ వ్యక్తిత్వ స్వభావములో నటన చూపుటకు చాలా తేడా ఉన్నది. రెండూ మోసమే. జీవితమే కాలానుగుణమైన మార్పులతో నటనను వ్యక్తీకరిస్తుంది.

సాధకుడు తనను తాను బేరీజు వేసుకొనునపుడు ఈ నాటకము స్పష్టముగా కనబడును. ఇది సాధారణముగా ప్రతిఘటనకు లోనగును. ఏవ్యక్తి అయినా తాను చేయుపనిలో ఆడంబరత కనబరిచినపుడు దానిని ప్రతిఘటించిన ఆతను అవమానకరముగా భావించి తిరగబడును లేదా ఆతను ఆవిధముగా నాటకమాడుటను సమర్ధించుకొనును. ఈ విధమైన ఆడంబరము అనవసరమని చాల అరుదుగా గ్రహించెదరు.

ఈ నటన ఒక సాధకుని ఆధ్యాత్మిక హోదాకు సంబంధించి ఇతరులు అతనిని మంచి ఉన్నత స్థితి సాధించిన వానిగా భావించెదరు, కాని వాస్తవముగా ఆస్థితిలో లేడని అతని జీవన పరిస్థితులు చాటిచెప్పినపుడు ఆతను మానసికముగా దెబ్బతిని ఆతను ఏమీ తెలియని స్థితిలో యేదో ఒక దానిని పట్టుకొనుటకు ప్రాకులాడును. ఇందులో చిత్రమేమిటంటే ఆతని చుట్టు ఉన్నవారు అతనికి దీనిని అంటకట్టెదరు. అందువలన తనని తాను మోసగించుకోకుండా జాగ్రత్తపడవలెను. విలియమ్ షేక్స్పియర్ తన "ట్వెల్త్ నైట్ " అనే నాటకములో "కొంతమంది గొప్పవారుగా పుడతారు, కొంతమంది గొప్పతనాన్ని సాధిస్తారు, కొంతమందిపై గొప్పతనము రుద్దబడుతుంది" అని వ్రాసినాడు. ఆధ్యాత్మిక గురువులలో చాలావరకు పైన చెప్పిన దానిలో

మూడవ దానికి చెందుతారు.
అటువంటి కృత్రిమమైన గుర్తింపును ఒకసారి అంగీకరించినామంటే వదిలించుకొనుట చాలాకష్టము.

ఆధ్యాత్మిక సాధకులకు, అసంతుష్ట దాహార్తిని తీర్చు అనేక ఎండమావులు కనబడు వాతావరణములో మనము జీవించుచున్నాము. దీనివలన అమాయకముగా వీటిలో చిక్కుకొని ఊహాజనితమైన లోకములలో విహరించి, పరిపూర్ణమైన ఆధ్యాత్మికతను నశింపజేసుకొను అవకాశములు మిక్కుటముగా కలవు. దీనినే జీవన్మృతస్థితి (Living dead) గా పొరబడు అవకాశముకలదు. కాని వాస్తవముగా అది ప్రాణములేని జీవి తప్ప వేరుకాదు.

ఈ నటన అనేకమైన అవతారములు ఎత్తును. దీనికి భక్త సమూహము మద్దతు లభించినచో అది యింకను బలపడును. ప్రతి వేడుకలకు భజనలు, కీర్తనలు పాడుకొనే రోజులివి. వారిలో వారు పాడుకొని, వారి గొంతుకను వారే వినుచు ఆనందించు వ్యక్తులగురించి మనకు తెలుసు. కాకి కావుకావుమనుటకు దానికి హక్కుకలదు. సంగీతము చాలా ఆసక్తికరమైన కళ.

చాలమంది సంగీత విద్వాంసులు భావప్రకటన వారి హద్దులను అధిగమించి బాగా పాడినట్లు నటిస్తుంటారు. ఇది చాలా తెలివిమాలినది. ఎందుకంటే మిగతా విద్వాంసులకు మరియు శ్రోతలకు యిది అవగతమవుతూనే వుంటుంది.  ఇక్కడ మనము సంగీతములోని అభిరుచి గురించి మాట్లాడుకోవటములేదు. ఒకవ్యక్తి సంగీతములో అతని భావప్రకటన గురించి మాట్లాడు కొంటున్నాము. గురుదేవుల జయంతి ఉత్సవాలు జరుగు సందర్భములలో యితరుల ముందు పాడు అవకాశము సంగీతకారులకు కలుగుతుంటుంది. అటువంటి సమయములో సరిగా పాడలేకపోయినను కూడా దానిని ప్రశంసించకుండా వుండుట అమర్యాదకరము. అటువంటి సంగీతకారులు వారి పరిధిని అతిక్రమించి పాడినపుడు, దానిని శ్రోతలు ప్రశంసించినపుడు; వారిలోని దర్పమునకు ఊతము లభించును. ఇది వారు అంటిపెట్టుకొని వుండు భావములను ధృఢపరుచును. ఇది తప్పుఅనికాదు, మనలోని ప్రతివారికి ఇవి వుంటాయి. ఇక్కడ మనము గ్రహించవలసిన విషయమేమిటంటే ప్రతిదానికి కొన్ని పరిధులుంటాయి. కాని అవి లేనట్లు నటించుటవలన యితరులతో ఇబ్బందులు ఎదురై, కలహములకు కారణమగును. ఏమైనను భజన తనంతతాను అసత్యమాడదు. ఇది యితరులు చేయు ఆడంబరమునకు సూచిక.

ఎవరైన వాస్తవమునకు బదులుగా తామేమిటో ఊహించుకొని కొన్ని భావములకు ఉద్రేకముగా

స్పందించినపుడు యిదే వర్తించును. ఇది సర్వసామాన్యమైనది. ప్రజలు తమ భావములను ధ్రువీకరించుకొనుటకు వారు జీవించుచున్న ప్రపంచములోని సంఘటనలను మరియు అనుభవములను పరిశీలించెదరు. ఆడంబరముతో విరుద్ధము కాని పరిస్థితులున్నపుడు, అవి బాగుగా పాడని గాయకుని మెచ్చుకున్న శ్రోతల పరిస్థితి వలె నుండును. తమ మనసులోని భావములను, అవియెంత తెలివిమాలినవైనను, నిజమని నిర్ధారించుకొనుటకు యిటువంటి పరిస్థితులను ఉపయోగించుకొనెదరు. తనపై బలవంతముగారుద్దబడిన ఈ ఆడంబరము గురు స్థానమైనపుడు, అతని అంతరంగములో ఆవిధముగా వుండుటకు యిచ్చగించినను, తనపరిధులు తెలిసివున్నపుడు, ఆధ్యాత్మిక జీవితములో అటువంటి స్థితిని కట్టబెట్టుట ఆ సమూహమునకు మరియు ఆవ్యక్తికి మిక్కిలి దురదృష్టకరమైనది. పూజ్యులైన డాక్టరు కె.సి.వరదాచారిగారు చెప్పినటులు "అన్నికాలములలోని ప్రజలు చరిత్రను పరిశుద్ధము చేసి వారు యెన్నడును అపరాధ భావనతో వుండని రీతిలో నీతివంతమైన ఆచరణలను ప్రవేశ పెట్టుట వారిపై ప్రభావము చూపిన ముఖ్యకార్యములలో ఒకటి." ఇదియే మానవులయొక్క అతిశయమునకు మూలము.

విజ్ఞాన సంపన్నులు వాస్తవముగాతెలియని వారని చెప్పినచో ప్రజలు అజ్ఞానములోనికి పోవు ప్రమాదము కలదు. ఇదే విషయము పూజ్య బాబూజీ మహారాజ్ వారు తమ సహజమార్గ దర్శనము అను పుస్తకములో క్లుప్తముగా చెప్పినారు. "తన బహిఃస్వరూప పాండిత్యము వ్యక్తిత్వములచే ప్రభావితుల నొనరించు వ్యక్తి యొక్క ప్రత్యక్షానుభవములను పరిశీలించినచో అధమాధమ దశయందుండుట సంభవించవచ్చును. కాని మహాత్ముడనుటకు గాని, యోగి అనుటకుగాని శాస్త్ర పరిజ్ఞానము ప్రమాణము కాదు. అట్లే మహాత్ముడుగాని గురువుగాని అగుటకు నిదర్శనము కేవలము యోగమార్గమున అతని స్వానుభవములేకాని, వారి అద్భుత శక్తి ప్రదర్శనలూ, అసాధారణ ప్రవర్తనలూకావు."

విద్యార్థిలో నిబిడీకృతమైయున్న సద్గుణములను వెలికి తీయుటయే విద్య యొక్క ఉద్దేశ్యము. ఆధ్యాత్మికరంగములో గురువులు అనేకమంది కలరు కాని సత్ సంపదను వెలికితీయు బోధకులు బహు అరుదుగా నుందురు. కాని గురువులందరు సత్ సంపదను వెలికితీయు సమర్థులుగా నటించెదరు. ఇటువంటి గురువులు ఆధ్యాత్మిక రంగములో అనేకమంది వుండుట నిరాశాజనకమైన పరిస్థితి. ఎవరైన తాను గురువునను భావన కలిగి యున్నచో అతను దైవస్థానమును అన్యాయముగా ఆక్రమించుటయేనని విశదీకరించిరి. దైవగురువులు (Divine masters) కూడా వుంటారని వారు వూహించ లేకపోవుటచే, వారి గురించి ఆయన ప్రస్తావించలేదు. వాస్తవమును చెప్పుట ద్వేషముతో జనుల ఆశలను వమ్ము చేయు అనవసర

కార్యముగా గోచరించవచ్చును. కాని ఉన్నది ఉన్నట్లుగా చెప్పుట సత్యము యొక్క లక్షణము. ఈ ఆడంబరము చేత చాలామంది వారికి లేని లక్షణములు ఆపాదించబడుచున్నవి. అదేవిధముగా చాలామంది సత్యమును పలుకుటకు సిద్ధముగాలేరు. ఇది కూడా ఒక విధమైన ఆడంబరము. ఈవిధమైన ఆడంబరము సాధనాపరముగా మిక్కిలి హానికరమైన మూఢనమ్మకములను కలిగించును. మన స్వభావమును పరిశీలించుకొనునపుడు యిటువంటి వాటితో జాగ్రత్తగా నుండవలెను. ఈవిధముగా జాగ్రత్త పడినపుడు, మన అంతరాత్మతో అసత్యమాడి జీవితకాలము ఆమోదించిన మూఢనమ్మకములలో ఆశ్రయము పొందుట సులభముగా యిష్టపడము. ఈ ఆడంబరము, జ్ఞానము, హోదా, మతము, రాజకీయము, జాతి, కులము, ఆధ్యాత్మికహోదా మరి ఏవిధమైనదైనను, పట్టించుకొనము.

మన ఊహలపై ఆధారపడిన అటువంటి పరిస్థితిలో, ఆడంబరము కోరిక తీర్చుకొనుటకు అవకాశము కలుగజేయును.

మూఢనమ్మకముతో చుట్టుముట్టిన కోరిక తీరినపుడు ప్రశాంతత కలుగును. తనకు విడిచిపెట్టవలెనని యిచ్ఛలేనప్పుడు కోరికలను విడిచిపెట్టనవసరములేదు. కాని కోరికలు తీరినంతమాత్రాన ప్రశాంతత కలుగదని తప్పక తెలుసుకొనవలెను. క్లుప్తముగా; యిదేవిధముగా ప్రశాంతతను పొందమని జనులకు బోధించుట బాధాకరమైన విషయము. ఆవిధముగా కలుగు ప్రశాంతత (కోరిక తీరుట వలన) తాత్కాలికమైనది. దీనివెంటనే మరియొక కోరిక తీర్చుకొనుటకు సిద్ధముగా నుండును. సాధారణముగా ప్రశాంతత పొందుటకు యిదే మార్గము బోధించబడును.

అనువైన పరిస్థితుల కోసము అన్వేషించుటవలన భవిష్యత్ కాలముపై దృష్టిసారించెదము. దీనివలన రాబోవు కాలములో ప్రశాంతత లభించునని మానసికముగా నిశ్చయించుకొనుట వలన, రేపు మారు కాలము కొరకు స్వేచ్ఛ, ప్రశాంతతలను యీరోజు వదలుకొందుము. ఇది వర్తమానములో చనిపోయి, భవిష్యత్కాలములో జీవించుటకు ప్రయత్నించు వారికి సంభవించును. ఇది పరిహాస్యాస్పదమైనది. సాధన వర్తమానకాలమునకే కాని భవిష్యత్‌కి కాదు. భవిష్యత్ యొక్క అస్థిత్వం మనసులోనే వుండునను విషయమును మనము తెలుసుకొనవలెను. ప్రస్తుతకాలములోనే జీవించుచు భవిష్యత్ కార్యమును ప్రణాళికాబద్ధము చేసుకొనవద్దని దీని అర్థము కాదు. నాప్రియమైన సహచరి ఫలించని నా ప్రణాళికలను గూర్చి తప్పుపడుతుంది. మన ప్రణాళికలు విత్తనము నాటినట్లని వాటి ఫలితమునకు హామీవుండదని బోధపడునట్లు చేయుటకు నాకు చాల సమయము పట్టినది. సంఘటనల ఫలితము ప్రశాంతత నివ్వాలని మనము ప్రణాళిక చేయము. పూజ్య గురుదేవుల ఆదేశానుసారము సాధన చేయువారు తమ స్థితిని బేరీజు

వేసుకొనిన వారు ప్రశాంతతతో జీవించుచున్నారని తెలియును. పూజ్య గురుదేవుల ఆదేశములను 5 నుండి 8 వరకు అర్థము చేసుకొని, మన నిజస్థితిలో జీవితమును సాగించినపుడు మనకు ప్రశాంతత లభించును. ఇది వితండ వాదముగా అనిపించవచ్చును కాని యిది కూడా నిజమే.

పరిస్థితులు మన అదుపులో నుండాలని సాధారణముగా వొక అభిప్రాయముంటుంది. కాని బాబూజీగారు చెప్పినదేమన బాహ్యమైన పరిస్థితులను మార్పు చేయుట మన పనికాదు కాని మనము వాటికి తగినట్లు మనలను మలుచుకొనుట అవసరము. ఇది సాధ్యమైనది. క్లుప్తముగా "జీవించు" అనే జీవిత పరమార్థము చాలా కష్టసాధ్యముగా అనిపిస్తోంది. మనము జీవించుట, అనిర్వచనీయమైన అనుభవము (Imperience) అనునది మనము యేదో చేయుట లేదా చేయకపోవుట అనుదానితో సంబంధము లేదు. కర్త అనునది ఒక భ్రమ అని మనకు తెలుసును. మనము జీవితమునుండి వేరు కాదని, మన వ్యక్తిగత జీవనము ఒక భ్రమ యని తెలుసుకొనినపుడు మరణ భయమును జయించెదము. ఈ వాస్తవ జ్ఞానము మన గ్రాహ్యశక్తిని అధిగమించి ప్రశాంతత కలుగజేయును. వాస్తవము (to realize) తెలుసుకొని దానికి కట్టుబడి వుండుట మన బాధ్యత. అపుడు మన ఆలోచన మరియు రూపముల యొక్క ప్రపంచమును మనము కానిదానికోసమై అర్థించుట విరమించుకొనెదము. ఒక లిప్తకాలములోని నిశ్శబ్దమైన మానసిక కల్లోలములేని స్థితి (nomind) లో మనము అనుకున్నదంతయు పోయి వట్టి చైతన్య స్థితి స్థిరపడునని మనకు తెలియును.

(పూజ్యులైన శ్రీ కె.సి.నారాయణ గారి బోధయంతి పరస్పరం నాలుగవ సంపుటిలోని Pretenseకు తెలుగులో స్వేచ్ఛానువాదము. పాఠకులు మరింత అవగాహనకు లేదా సందేహనివృత్తికి ఆంగ్లరచనయే ప్రామాణికముగా తీసుకొనవలసినదిగా మనవి చేసుకొనుచున్నాను. - వి.రామం)